క్లుప్తంగా

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఆలమూరు: పెనికేరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిశోర్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు చెందిన వైద్యులు రానున్నారన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పాశర్లపూడిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో భక్తులు

మామిడికుదురు: పాశర్లపూడిలో శ్రీభూ సమేత చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఉదయం 7.30 గంటలకు వైభవంగా జరిగింది. పూర్ణాహుతి, రత్నన్యాసం, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం నిధులు రూ.లక్ష, భక్తుల విరాళాలు రూ.తొమ్మిది లక్షలతో ధ్వజ స్తంభాన్ని పునః ప్రతిష్ఠించారు. భారీ సంఖ్యలో భక్తులు పూజాదికాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వీరభద్రుని సంబరం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు అరిగెలవారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద స్వామివారి సంబరం సోమవారం కన్నుల పండువగా జరిగింది. వీరభద్రుని ప్రతిమలతో స్థానిక కౌశిక వరకూ ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు ఉమాపార్వతీ సమేత వీరేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీరభద్రుని ఆలయ ప్రాంగణంలో స్వామివారికి పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణం వద్ద ఉదయం, సాయంత్రం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

వాడపల్లి వెంకన్నకు పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకునేందుకు అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

సఖినేటిపల్లి: గుర్తింపు పొందిన ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలన్నీ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎంఈఓ-1 డి.కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యా హక్కు చట్టం అమలుపై విద్యాశాఖ ఏర్పాటు చేసిన గోడపత్రికను ఎంపీపీ వీరా మల్లిబాబు ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన సమాచార పత్రాలను ఎంపీపీతో పాటు ఎంపీడీఓ బడుగు మంగాదేవిలకు ఎంఈవో అందజేశారు. ఐదేళ్లు నిండిన పిల్లలు 1వ తరగతిలో ప్రవేశానికి 25 శాతం ఉచిత సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జమానా అవతరణ దినోత్సవం

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, చివరి ప్రవక్త ఇమామే జమానా అవతరణ దినోత్సవాన్ని నగరంలో ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. కల్కి భగవానునిగా జమానాను ముస్లింలు నిండు మనస్సుతో ఆరాధిస్తారు. ఇందులో భాగంగా హుజ్జతీయ భవనం నుంచి జమానా వాహనమైన 'ఓడ'ను తీసి ఊరేగించారు. పూర్వీకుల ఆత్మశాంతి కోరుతూ వారి సమాధుల వద్ద పూజలు చేసి, బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. మామిడికుదురులోని బాషు పంజాలో మిలాద్ జరిగింది. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా ఇమామే జమానా మహిమలను వివరించారు. హుజ్జతీయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఓడను నగరం పీర్ల చెరువులో వదిలి పెట్టారు. మామిడికుదురులోని బార్గాహే ఖమరే బనీ హాసిమ్ పంజాలో భక్తులకు ప్రసాదాలను పంచారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన



కుళాయిలను పరిశీలిస్తున్న మధుసూదనరావు

అయినవిల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో మనబడి నాడు-నేడు కార్యక్రమంలో జరుగుతున్న పనులను సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సోమవారం పరిశీలించారు. సిరిపల్లి, తొత్తరమూడి, శానపల్లిలంక, కొండుకుదురు పాఠశాలల్లో పనులను ఆయన పరిశీలించారు. డ్రింకింగ్ వాటర్ సిస్టమ్, టాయిలెట్స్, తరగతి గదులు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆశయం మేరకు పనిచేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాస్ ఉన్నారు.

పేదల కోసమే పథకాలు

ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సోమవారం ఈదరాడలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఏడు గ్రామాల పరిధిలోని 336 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా పేదల కోసం సంక్షేమం ఆగలేదన్నారు. సీఎం జగన్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలకు వణుకు పుడుతోందన్నారు. సింగిల్‌గా జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక పొత్తులతో కుట్రలు పన్ని ఎన్నికలకు వెళ్తున్నాయన్నారు. ఎన్ని పార్టీలు కలిసినా, ఎంత మందితో పొత్తు పెట్టుకున్నా వచ్చేది జగన్ ప్రభుత్వమేనన్నారు. వైఎస్సార్ సీపీ వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్య, పార్టీ నేతలు యెరుబండి సత్యనారాయణమూర్తి, యెరుబండి సూరిబాబు, వడ్డి ఆదిబాబు, చేట్ల సత్యనారాయణ, యెరుబండి శ్రీరామమూర్తి, వలవల పెదబాబు, వర్ధినేని రాము, నయినాల సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కృషి

సఖినేటిపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మోరిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అలాగే రూ.22 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, జేజేఎంలో రూ.40 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకును ఆయన ప్రారంభించారు. వీటితో పాటు మోరిలో డ్రెయిన్‌కు ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.86 లక్షలతో కాంక్రీట్ వాల్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, మహిళా ప్రతినిధులు మొల్లేటి మహేశ్వరీ, పెదపాటి నాగలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు జాన శంకరరావు, దొంగ నాగసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో సరికొత్త అధ్యాయం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం

అయినవిల్లి: రాష్ట్ర పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని, సంక్షేమాన్ని ప్రతి ముంగిటకు తెచ్చారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం విలసలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, అయినవిల్లిలో రూ.61.80 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, తొత్తరమూడిలో రూ.79.30 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర భవనం, వెల్‌నెస్ సెంటర్, మాగాంలో రూ.39.30 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, కె.జగన్నాథపురంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథాన పరుగులు తీస్తుందన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలోనూ పేదలకు భరోసా కల్పించారన్నారు. సర్పంచులు కాకర శ్రీనివాస్, కాశీ వీరవెంకట సత్యనారాయణమూర్తి, కుసుమ లిల్లీమంగేష్కర్, వార జయసావిత్రి, మేడిశెట్టి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.



విలసలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పేదల జీవితాలకు వెలుగు వచ్చిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని 646 మంది లబ్ధిదారులకు నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇంటి స్థల హక్కు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. మరింత అభివృద్ధి, సంక్షేమం కావాలంటే ప్రజలంతా జగన్‌కు అండగా నిలవాలని చిట్టిబాబు కోరారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య, యూవీవీ సత్యనారాయణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, నాయకులు తులా గోపాలకృష్ణ, జోగి రామకృష్ణ, చిక్కం బుజ్జిబాబు, కడిశ్రీను, బొరుసు నరసింహమూర్తి, కుసుమ శ్రీను పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

అయినవిల్లి: సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రతి ఒక్కరికీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన ఉండాలని డిప్యూటీ కలెక్టర్ మధుసుదనరావు అన్నారు. సోమవారం తొత్తరమూడిలోని అయినవిల్లి మండల మహిళా సమైక్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు, లీడర్లకు ఆయన అవగాహన కల్పించారు. ఈవీఎంలపై ఉన్న అపోహలను నివృత్తి చేశారు. తహసీల్దార్ ఎల్.ప్రమద్వర, డీఆర్‌డీఏ ఏపీఎం వెంకటేశ్వరరావు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు బి.శాంతి, ఆర్‌ఐ విహారి పాల్గొన్నారు.

శెట్టిబలిజలను మోసం చేసిన చంద్రబాబు, పవన్



పితాని నరసింహారావు, మానేపల్లి

పి.గన్నవరం: శెట్టిబలిజలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొనే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఒక్క పార్లమెంటు లేదా అసెంబ్లీ స్థానాన్ని కేటాయించలేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పితాని నరసింహారావు విమర్శించారు. సోమవారం ఆయన పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లో శెట్టిబలిజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో శెట్టిబలిజలకు ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ స్థానాలను కేటాయించారని గుర్తు చేశారు. శెట్టిబలిజలకు వైఎస్సార్ సీపీలో న్యాయం జరుగుతుందని వివరించారు. జరుగుతున్న పరిణామాలను గుర్తించి శెట్టిబలిజలంతా వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని పితాని విజ్ఞప్తి చేశారు.

వచ్చే ఎన్నికల్లో మనదే విజయం

జెడ్పీ చైర్మన్ విప్పర్తి, పరిశీలకుడు చెల్లుబోయిన

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విప్పర్తిని సోమవారం చెల్లుబోయిన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమాఖ్య నాయకులు, పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్ మన రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగాలని సూచించారు. జగన్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను విప్పర్తి దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

ఆలమూరు: సూర్యారావుపేటకు చెందిన వివిధ పార్టీల ఎస్సీ, బీసీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి, పార్టీ నేతలు చింతపల్లి నాగేశ్వరరావు, కడలి దుర్గారావు, కడలి ఉపేంద్ర, నేరేడుమిల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో సుమారు 100 మంది ఆదివారం రాత్రి ఆత్రేయపురం వెళ్లారు. అక్కడ పర్యటనలో ఉన్న కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి చెరుకూరి శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ వారు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు సూర్యారావుపేట గ్రామస్తులు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో పాలమూరి సతీష్, అశోక్, దారా జయరాజు, గొల్తి ప్రసాద్, నారా తాతారావు, అంబటి ప్రవీణ్, కాశి సత్యనారాయణ, కోట ప్రసాద్ తదితరులు ఉన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



సూర్యారావుపేటకు చెందిన కార్యకర్తలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

మాదిగలకు మొండిచేయి

పి.గన్నవరం: జిల్లాలోని ఒక పార్లమెంట్, మూడు అసెంబ్లీ రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు సీట్లు కేటాయిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారని వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండేటి నానిబాబు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగలను మోసం చేస్తున్న నైజం చంద్రబాబుది అయితే, జిల్లాలో సామాన్య మాదిగ కార్యకర్తను ఎమ్మెల్సీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మాదిగలకు మేలు చేసేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ ప్రభుత్వం విజయం సాధిస్తుందన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు వేగంగా అందించాలి

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆరోగ్యశ్రీ కార్డులు నూరు శాతం పంపిణీ చేయాలని ఎంపీడీఓ కె.వాణి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వానపల్లి, అవిడి పీహెచ్‌సీల పరిధిలోని ఏఎన్ఎంలు, పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలు కార్పొరేట్ వైద్య సేవలు పొంది, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే సంకల్పంతో ప్రభుత్వం నూతన ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసిందన్నారు. వాటిని వలంటీర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్డులు త్వరితగతిన అందరికీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో బల్క్‌మిల్క్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం త్వరలో పాల సేకరణకు చర్యలు చేపట్టిందని, ఆ మేరకు తగిన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలన్నారు. మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని ఏఎన్ఎంలకు సూచించారు. పేరవరం పశు వైద్యాధికారి, జగనన్న పాల వెల్లువ మండల నోడల్ అధికారి ఎ.రవితేజ, ఈఓపీఆర్డీ సుబ్బారావు, గ్రామ కార్యదర్శులు వీవీ రామన్, మంగిపూడి రాంబాబు, ఎస్.రెడ్డినాయుడు, పి.సత్తిబాబు, శాంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే..

అంబాజీపేట: గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి విశ్వరూప్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. రాజకీయాల్లో విశ్వసనీయతను నెలకొల్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకపక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమం చేస్తున్నారన్నారు. అంతకు ముందు మంత్రి విశ్వరూప్‌ను ఘనంగా సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌ను సన్మానించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, సూదాబత్తుల రాము, మట్టపర్తి హరి, మట్టా వెంకటేశ్వరరావు, పితాని కాశీ, దొమ్మేటి నాగన్న తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేట మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌ను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

సభను విజయవంతం చేయండి

మామిడికుదురు: ఏలూరులో మంగళవారం జరిగే బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు కోరారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షతన పాశర్లపూడిలో సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఏలూరులో బీజేపీ బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారన్నారు. ఈ సభకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరవుతారన్నారు.

బ్రహ్మోత్సవాలకు విరాళం



గుమ్మిలేరులో దాత రాంబాబుకు ఆధ్యాత్మిక గ్రంథాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



విలసలో వీరభద్రుని సంబరంలో ఊరేగుతున్న కరికాల భక్తులు

ఆలమూరు: చింతలూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రూ.70 వేలు విరాళంగా అందించారు. ఈ నెల 29న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఐదు రోజుల పాటు సుమారు 15 వేల మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. దీనికి అయ్యే రూ.70 వేలతో కూరగాయలను కొనుగోలు చేసేందుకు గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దాత రాంబాబుకు ఆధ్యాత్మిక గ్రంథాన్ని అందజేశారు. అల్లం రాజు భరణీ, నామాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విలసలో వీరభద్రుని సంబరం

అయినవిల్లి: విలసలో కరికాల భక్తుల ఆధ్వర్యంలో వీరభద్రుని సంబరం నిర్వహించారు. 12 మంది భక్తులు బుగ్గలకు, కంఠానికి శూలాలు గుచ్చుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. తొలుత వీరభద్రునికి విశేష పూజలు, ప్రత్యేక హోమం నిర్వహించారు. భూమాడి వీర్రాజు ఆధ్వర్యంలో కారికాల భక్తులను గ్రామంలో ట్రాక్టర్‌పై ఊరేగించారు. సాయంత్రం భక్తులు అగ్నిగుండం తొక్కారు. తర్వాత అన్నదానం చేశారు. అలాగే అయినవిల్లిలో వీరభద్రుని సంబరం నిర్వహించారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

మలికిపురం: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల స్థాయిలో ఈ నెల 25న అమలాపురంలో జరిగిన పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో మలికిపురం ఎంవీఎస్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల బయో టెక్నాలజీ తృతీయ సంవత్సరం విద్యార్థిని గోడి సుభద్ర ప్రథమ స్థానం సాధించింది. సోమవారం కళాశాలలో ఏర్పాటైన అభినందన సభలో విద్యా సంస్థల సెక్రటరీ- కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి విద్యార్థినిని శాలువా వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ తోరం సతీష్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలమూరు: కలవచర్లకు చెందిన గ్రామ రెవెన్యూ అధికారి టి.అబ్బులు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఇటీవల అమలాపురంలో కంకిపాటి వెంకటేశ్వరరావు ఫిట్నెస్ జిమ్ ఆధ్వర్యంలో డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉభయ గోదావరి జిల్లాల కుంగ్‌ఫూ కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాంజ్ మెడల్‌ను సాధించిన అబ్బులను జిల్లా పవర్ లిఫ్టింగ్ అండ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిద్దు వెంకన్నాయుడు, ఆర్.కృష్ణ పద్మరాజు చేతుల మీదుగా పతకాన్ని అందించారు. తహసీల్దార్ కె గోపాలకృష్ణ, కంకిపాటి వెంకటేశ్వరరావు, ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ అందుకుంటున్న అబ్బులు

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఆలమూరు: చెముడులంకలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞాన ప్రచార కార్యక్రమం జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో భక్తబృంద సభ్యులు ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల బోధనలను ప్రజలకు వివరించారు. వచ్చే శివరాత్రి పర్వదినం విశిష్టతను ఇంటింటికి వెళ్లి తెలియజేశారు. అనంతరం హిందూ మత గ్రంథాలను ప్రదర్శించి ప్రచార ఆవశ్యకతను తెలిపారు. త్రైత సిద్ధాంత ప్రతినిధులు వేణుమాధురి, శోభారాణి, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ, బీఎస్ఎన్ మూర్తి, లోహిత, జోష్, జస్వంత్, విజయ్, భరత్, జైరాం, భరత్, జయ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.50 వేల విరాళం

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి మోదుకూరుకు చెందిన వ్యాపారవేత్త గుణ్ణం వీర్రాజు రూ.50 వేల విరాళం అందించారు. స్థానిక కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామి అధ్యక్షతన సోమవారం కళాశాల ప్రణాళిక, అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సీడీసీ కార్యదర్శి గారపాటి త్రిమూర్తులు, న్యాయవాది ఎస్‌కే షరీఫ్, ఎంఈఓ పీవీ సుబ్బరాజు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరావు, వైద్యాధికారి పి.భవానీశంకర్ పాల్గొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మొట్టమొదటగా జాయిన్ అయిన 15 మంది విద్యార్థులకు (కోర్సుకు 15 మంది చొప్పున) కళాశాల అభివృద్ధి కమిటీ పూర్తి ఫీజులు చెల్లిస్తుందని సమావేశంలో తీర్మానించారు. ఫ్లెక్సీలు ప్రచార పత్రాలు తదితరాలకు తాను వితరణ చేస్తానని న్యాయవాది షరీఫ్ అన్నారు. కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కమిటీ సభ్యుడు వీర్రాజు రూ.50 వేలను విరాళంగా అందజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో సోమవారం 1979-80 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా ఒకచోట కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలుగా, రాజకీయ, వ్యాపార వేత్తలుగా స్థిరపడిన వారంతా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం గెడ్డం రమేష్‌బాబు, పి.విజయానందం, పీడీ విల్సన్, గెడ్డం యోహాన్, గొల్ల విజయరత్నం, డి.జగదీప్ కుమార్, డి.సువర్ణరత్నం, ఎస్.మాణిక్యాలరావు, నల్లి శుభాకర్‌బాబు, ఐ.శుభాకర్, సుబ్బరాజు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతానికి పిలుపు

ఆలమూరు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.మేరీరోజ్ అధ్యక్షతన సోమవారం వైద్య, ఐసీడీఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 3,327, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 2,094 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ తెలిపారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మేరీరోజ్, ఎంపీపీ లక్ష్మణరావు తదితరులు సూచించారు.

స.హ. చట్టం అమలు చేయాలి

సఖినేటిపల్లి: ఎండోమెంట్స్ విభాగంలో కూడా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. సోమవారం టేకిశెట్టిపాలెంలో ఆయన మాట్లాడారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

అంబాజీపేట: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ అవసరాలకు అందిస్తున్న స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఎట్టి పరిస్థితుల్లో తీసుకునేది లేదని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, రైతులు బొంతు పెదబాబు తెలిపారు. అంబాజీపేట విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద రైతులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లపై ఏడీఏ జి.అన్నవరం అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతు ఎన్ని యూనిట్లు వినియోగించారో ఈ స్మార్ట్ విద్యుత్ మీటరు ద్వారా తెలుసుకుని, సదరు రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేస్తారన్నారు. వాటిని తిరిగి విద్యుత్ శాఖ జమ చేసుకుంటుందన్నారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దని ఏడీఏకు రైతులు చెప్పారు.

పరస్పర ఫిర్యాదులు

మామిడికుదురు: కులం పేరుతో దూషించి, దాడి చేసిన ఘటనలో పెదపట్నంలంక గిడుగువారిపాలేనికి చెందిన గుండాబత్తుల తరుణ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని నగరం ఎస్సై పి.సురేష్ సోమవారం తెలిపారు. శనివారం రాత్రి తరుణ్ తనను కులం పేరుతో దూషించి, దాడి చేశాడని అదే గ్రామానికి చెందిన ముత్తాబత్తుల రవి ఫిర్యాదు చేశాడన్నారు. అలాగే తనపై ముత్తాబత్తుల రవి శనివారం రాత్రి దాడి చేశాడంటూ గుండాబత్తుల తరుణ్ ఇచ్చిన ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.